

# మాతృప్రేమ

శ్రీ కృష్ణమాచార్య. ఎం. ఏ.

అది ఒకపల్లెటూరు. అవ్వూరి పిల్లలందరికి అల్లరి నేర్పుటలో నాయకుడు సమీరకుమారుడు. ఒక నూతన అల్లరి అతనికి స్ఫురించినది. ఆ నదీతీరమునందు పడవగా తయారుచేయుటకు గాబోలు ఉంచబడిన కొయ్యమొద్దును నదీప్రవాహములోనికి దొర్లించుటయే. అమొద్దు నక్కడ ఉంచినవారికి కోపము జనించునట్లుజేసి, ఆతనిని ఏడ్పించుటకు పిల్లలందరు సంకల్పించిరి. ప్రతిబాలుడును తన ఆమోదమును తెల్పినవాడేగాని, కాని దీనిని ఆచరణలోనికి పెట్టుటయో ?

పిల్లలందరు ఆ కొయ్యమొద్దును ప్రవాహములోనికి దొర్లించుటకు భగీరథప్రయత్నములు చేయుచుండిరి. ఆ సమయమునకే ఆటలయొక్క నిష్ప్రయోజనమునుగూర్చి యోచనసల్పు ఒక చిన్న తత్వవేత్తవలెనున్నపుడు చున్న సమీరకుమారుని అనుంగు తమ్ముడగు ప్రభు ఆ మొద్దుమీదవచ్చి కూర్చుండెను. బాలులందరు ప్రభును అచ్చటనుండి లేవమని మిగుల బాధింపజొచ్చిరి. కాని ప్రభు అట్లే నిశ్చింతగా కూర్చుండెను. సమీరుడు కోపముచే మండిపడుచూ "ప్రభూ, లేచెదవా లేదా ? లేకపోతే నిన్ను చితుగకొట్టెదనని" బెదిరించెను. కాని బాలుడగు ప్రభు దీనికిని లక్ష్యపెట్టక, పకపక నవ్వసాగెను.

తక్కిన బాలులందరి ఎదుట రాజతీవిని నిలబెట్టుకొనవలసి వచ్చినచో, తన ప్రతిజ్ఞను నిర్వర్తించుకొనవలయునుగదా ! కాని అట్టి విషమపరిస్థితులయందు అతనికి ధైర్యము వెనుకబడెను. కాని తగిన గౌరమును కాపాడుకొనుటకు ప్రభుతోగూడ ఆదుంగనుదొర్లించుటకు తోడిబాలురకు ఆజ్ఞనిచ్చెను. బాలురంతా తమ శక్తి కొలది దొర్లించ ప్రయత్నించిరి. "ఒకటి, రెండు, మూడు" అను నంతలో ఆ మొద్దు దొర్లించబడెను. మొద్దుతోగూడ ప్రభుగూడ క్రిందకు దొర్లింపబడెను. పిల్లలంతా విరగబడి నవ్వదొడగిరి. ప్రభుకు కోపము మరింత హెచ్చిపోయెను. బాలుర నవ్వుచూచి ప్రభుకు కోతికి తేలుకుట్టినట్లాయెను. ప్రభు మట్టి దులుపుకొనుచు లేచి గజకుంభముపై దూకు సింహముమాదిరి సమీరునిపై దూకి, ఆ సోదరుని ముఖమంతయు బరికి, రక్కసాగెను. ఇంతటితో తృప్తిపడక

సమీరునికొట్టి, ఏడ్చుచు ప్రభుగృహోన్ముఖుడై చనెను. దీనితో ప్రథమాంకము ముగిసినది.

* * *

సమీరుడును విచారముగా ముఖమును తుడిచికొనుచు గాలికి నదీతీరమునందు పడియున్న వృక్షముపై గడ్డిపోచ నొకదానిని కొరుకుచు, ఏదో దీర్ఘమగు ఆలోచనయందు మగ్నుడై కూర్చుండియుండెను. నిర్లక్ష్యముగా గడ్డిపోచను నమలుచు కాళ్ళను నీటియందు ఊగలాడించుచుండెను. ఇంతలో ఆ రేవునకు ఒకపడవవచ్చి ఆగెను. దానినుండి దీర్ఘకాయుడగు నడి వయస్కుడొకడు దిగి, ఆ ఊరియందలి బ్రాహ్మణ గృహమునకు దారి నడిగెను. కాని సమీరకుమారుడు 'పోయి వెదకికొని తెలిసికొనుట ఉత్తమమని హేళనగా జవాబు చెప్పెను.

ఇంతలో సమీరుని తల్లివద్దనుంచి ఆతని పిలుచుటకు సేవకుడొకడు రాగా, కదల నిరాకరించెను. ఆ ప్రదేశమునుండి సమీరుని జరజర ఈడ్చుకొనిపోయెను. బాలుడగు ప్రభును పడద్రోసినందులకు సమీరుని, అతని తల్లియగు సుశీల బాదసాగెను. ఒక నూతన వ్యక్తి ఆ యింట ప్రవేశించి బాలుని కొట్టవలదని అడ్డపడుటచే సుశీల ఆశ్చర్యపోయెను. సమీరుడును పరాభవమును తలంచుకొనుచు, తలవంచుకొనెను. సుశీలయొక్క ఆగ్రహమంతయు ఆశ్చర్యముగా మారిపోయి ఆ వచ్చిన నూతన వ్యక్తి తన యన్నయగు వసంతమూర్తియని గుర్తించి "ఎచ్చటనుండిరాక" అని కుశలప్రశ్నలడిగి నమస్కరించెను. బాలురగు సమీరుడును, ప్రభుయుగూడ ఆగంతకునకు నమస్కరించిరి.

సుశీల వివాహమైనవెంటనే వసంతమూర్తి వ్యాపారము చేసికొనుటకు వేరే గ్రామము పోయియుండెను. ఆతడా గ్రామమందుండగనే సుశీల తనభర్తను గోల్పోయి, తన యిద్దరు పిల్లలను పెట్టుకొని ఎట్లో కాలము గడుపుచుండెను. చాల దినములగుటచేత నీసోదరిని చూచుటకు విచ్చేసినాడు వసంతమూర్తి: అతడక్కడున్న మిగిలిన దినములన్నియు సంతోషముగా గడచిపోయెను. పిల్లల చదువు విషయము తన సోదరిని ప్రశ్నింప సమీరుడు సోమరిపోతనియు, చదువులేక అల్లరిచిల్లరగా తిరుగుననియు కాని ప్రభు మాత్రము అట్లుగాక చదువుయందు మిగుల శ్రద్ధగలవాడనియు సుశీల తెల్పెను. సమీరుడును చేయునదేదియు లేక విచారముగా నాల్గువైపుల పరికించుచుండెను. సమీరుని తాను తీసికొనివెళ్ళి తన పిల్లలతో పాటు విద్యనేర్పించుటకు వసంతుడు సుశీలను బహు కష్టముమీద ఒప్పించగలిగెను. కాని సుశీలమనస్సు కొంచెము సంతోషింపజొచ్చెను. ప్రభును నిత్యము ఏడ్పించుటవల్లనను, నిర్లక్ష్యభావము వృద్ధిచెందుటవలనను, ఇంటియందు సమీరుని అల్లరి తప్పినదని సంతోషించినది. కాని మాతృహృదయముగనుక సమీరుడు తన మామతో వెడలిపోవుటకు చూపించిన ఆసక్తినిచూచి సుశీల కొంచెము దుఃఖింపసాగెను.

సమీరుడు ఊరికి వెళ్లుటకు ఉవ్విళ్లూరిపోవుచుండెను. బయలుదేరు టెప్పుడని మాటిమాటికి వసంతుని వేధింపదొడగెను. ఇంటియందుండుట ముళ్ళమీదనున్నట్లుండెను. తాను ఊరికి వెడలునప్పుడు సమీరునకు తన చిన్నసోదరునిపై ప్రేమ పొడసూప మొదలిడెను. తాను ఆడుకొను గాలిపటమును గోలీలను, అచ్చుబొమ్మల పుస్తకమును మొదలగు వాటిని ప్రభునకు బహుమతిగానిచ్చి తన మేనమామతో బయలుదేరెను.

* * *

సమీరుడు తన మేన అత్తను చూచుట కదియే ప్రథమపర్యాయము. తన మువ్వురు పుత్రుల అల్లరికే మిగులవగచుచుండ, నూతన బాలుడుకూడ కూడినచో అల్లరి మరింత హెచ్చు పెరుగునని ఆమె సమీరుని రాకకు

అంత ఇష్టము చూపలేదు. ఆమె అతని ఎడమూపు నిరాదరణకు మేరలేకుండెను. ప్రతిమారును ఆమె ఈసడించుకొను మాటలతో సమీరుని మనముచు చిన్నబుచ్చుచుండెను. సమీరుడు తనస్వగ్రామమందు గడిపిన విషయములనన్నిటినిగుర్తు తెచ్చుకొనుచుండెను—తన బాలస్నేహితులు ఈతలుగొట్టుచు దినమంతయు గడపునదియు అన్నిటికంటెను ప్రియతమమగు మాతృదేవియు దృష్టిపథమునందు కన్పట్టసాగెను. తన మనస్సునకు జ్ఞప్తికివచ్చు విషయములన్నియు మాటిమాటికి అతనిని బాధింపసాగెను.

తన పాఠశాలయందలి బాలురలో సమీరుడే తెలివిహీనుడుగా పరిగణింపబడుచుండెను. సదా ఏదో ఆలోచించుకొనుచు పరధ్యానముగానుండి సమీరుడు లోలోన కుమిలి కృశించిపోవుచుండెను. ఇట్లు దినములను బహుకష్టముగా గడపుచుండెను.

ఒక దినమున ఎట్లో ధైర్యము చిక్కబట్టుకొని "వసంతమామా! నేనింటికెళ్లుట ఎప్పుడని బహుదీనముగా అడిగెను." సెలవు లిచ్చినపిదప అని జవాబువచ్చెను. కాని సెలవులిచ్చుటకు చాల వ్యవధానముగలదు. వైశాఖ మాసమునందుగాని సెలవు లిచ్చునట్లులేదు. చాల తడవుండెనని సమీరుడు మిగుల దిగులు చెందుచుండెను.

ఒకరోజున సమీరుడు తన పుస్తకము నెక్కడో పారవేసుకొనెను. ప్రతినిత్యము మేష్టరు ఏదో ఒక నెపమున సమీరుని బాదుచుండెను. తోడి బాలురు సహితము హేళన చేయుచుండిరి. తన మేన అత్తయగు సుధాబాలతో భయకంపిత స్వరముతో పుస్తకము విషయము ఎరుకపఱచెను. ఆమె పళ్లుపటపటమని కొరుకుచు "మాసమునకు ఐదుసార్లు నీకు పుస్తకములు కొనుచో కొంప గుల్లయగునని కఠినోక్తులాడి కొట్టుటకుగూడ సిద్ధపడెను.

ఆరాత్రి సమీరుడు బడినుండి ఇంటికి తిరిగి వచ్చునపుడు తల నొప్పిచే మిగుల బాధపడుచుండెను. చలివల్ల శరీరము వణక మొదలిడెను. త్వరలో చలిజ్వరము రానున్నదని తెలిసికొనెను. కాని తన మేనత్తయగు సుధాబాల తన్ను మరింత బాధించునని తలపోయుచు నడుచుచుండెను.

* * *

మరునాటి ఉదయమున సమీరు డెచ్చటను కానరాలేదు. అతనిని వెదకుటకు చేయు ప్రయత్నములన్నియు నిష్ఫలములాయెను. ఆరాత్రంతయు ఆకాశము చిల్లిపడినట్లు కుంభవృష్టి కురియుచుండెను. ఉరుములు మెఱపులకు లెక్కలేదు. సమీరుని వెదకుటకు బయల్వెడలినవారెల్లరు తడిసి ముద్దయై పోయిరి. కాని సమీరుని జాడ తెలియలేదు. చేయునదేదియు లేక రక్షకభటుల సాహాయ్యమపేక్షించెను.

మరునటి రోజంతయుకూడ ఎడతెరిపిలేక వర్షము కురియుచునే యుండెను. వీధు లన్నిటినుండియు వర్షపాత జలము ఏరులవలె పారుచుండెను. ఇద్దరు పోలీసులు సమీరుని చేతులమీద మోసికొనివచ్చి వసంతు కప్పగించిరి. సమీరుడు నఖశిఖపర్యంతము తడయుటచేత ముద్దయై వణకుచుండెను. నేత్రములు జ్యోతులవలె ఎర్రగా కన్పడుచుండెను. వసంతుడు తన మేనయల్లుని ఎత్తుకొని లోనపరుండబెట్టెను. కాని వసంతుని భార్య "మరల ఈ పిల్లనితో గోలవచ్చి పడినది వాళ్ళయింటికి పంపకపోతిరా యని విసుగుకొన జొచ్చెను. సమీరుడు ఆమాటలు విని వెక్కి వెక్కి ఏడ్చుచు" మామా! నేను మాయింటికే పోవుచుండ, వీరు పట్టుకొని మరల ఇచ్చుటకు ఈడ్చుకొని వచ్చినారని భోరుమనెను.

సమీరునకు జ్వరము నానాటికి తీవ్రరూపము దాల్చుచుండెను. సంధిగూడ ప్రవేశించెను. స్పృహాగల్గినపుడెల్ల "మామా సెలవుదినములు వచ్చినవా? నే నింటికేగవచ్చునా" అను పల్కులు పలుమార్లు అతని నోటినుండి వినవచ్చుచుండెను. సమీరుని నేత్రములనుండి కారుచున్న అశ్రుధారలను తుడుచుచు దినమంతయు

మంచమువద్దనే గడపుచుండెను. సమీరుడు అప్పుడప్పు డేదియో గొణుగుచుండెను. ఒక్కొకతరి "అమ్మా నన్ను కొట్టకే అమ్మా నిజము చెప్పెదనే" అని బిగ్గరగా అఱచు చుండెను.

మరుదినము సమీరునకు కొంచెము తెలివి కలిగెను. ఆతనినయనములనుండి పోయినప్రియ వస్తువుకొఱకు వెదకుకొనునట్లు గదినంతయు దృక్కులు పరుగెత్తసాగెను. కాని నిరాశచేగాబోలు అతని శిరము మాటిమాటికి దిండుపై వ్రాలిపోవుచుండెను. వసంతుడు సమీరుని దృక్కులయొక్క అర్థమును గ్రహించి "సమీరు, మీ అమ్మకొరకు కబురుచేసితిని ఆమె త్వరలో రాగలదని ధైర్యము చెప్పుచుండెను.

అపరాహ్ణమగుచుండెను. వైద్యుడు సమీరుని పరీక్షించి "ఈ దినము గడిచినచో" అని వెళ్ళిపోయెను. వసంతుడు లోలోన కుమిలిపోవుచుండెను. సాయంకాలముగావచ్చెను. భానుడు పశ్చిమాద్రి గ్రుంకుచుండెను. సుడిగాలివలె సమీరుని మాతృదేవత రొజుకొనుచు ప్రత్యక్షమాయెను. ఆమె పడు వేదనకు పరిమితిలేదు. ఆమెచేయు రోదనమునకు మేరలేదు. ఆమె కుమారుని చూచి గుండెలు బాదుకొనుచు ఏడ్వదొడగెను. కాని వసంతుడు ఓదార్చ ప్రయత్నించెనుగాని విఫలుడయ్యెను. ఆమె సమీర కుమారుని మంచముపైవ్రాలి "సమీర కుమారా" అని గోలపెట్టెను.

సమీరుడు కన్నులు విప్పి తనతల్లిని ఒక్కమాటు చూచెను. సుశీలయు "సమీర్, సమీర్" అని మరల మరల ఏడ్చుచు పల్కుచుండెను.

సమీరకుమారుడు మెల్లగా తలను ఆమెవైపుకు త్రిప్పి "అమ్మా నేడుగదా సెలవుదినములు వచ్చినవి" అని శాశ్వతముగా కన్నులు మూసుకొనెను. సుశీల నేలపైకూలబడెను.

(స్వేచ్ఛానుకరణము)


# ఆనంద ఆంగ్ల భాషాబోధిని

728 పేజీలు 16 నిండు పేజీ చిత్రములు




తెనుగు తెలిసిన మీరు స్వయముగ మూడు మాసములలో ఆంగ్లమును వ్రాయను, చదువను, మాటాడను నేర్చుకొనగలరు.

వ్రాత, ఉచ్చారణ అన్నీ స్వయముగ మీకు సావకాశము గల సమయములందు దినమున కొక గంటవంతున చదువుచు నేర్చుకొనగలరు. ఈ దినములందు ఆంగ్లపరిచయ మవసరము. అవకాశమున్న సమయమున యిటులుండ రాదు. ఒక మహాభాష నింత సులభముగ మీకు తెలుపగల 728 పేజీల గ్రంథమేది? ఆనంద ఆంగ్లభాషాబోధిని.

నేడే యీ గ్రంథమును తెప్పించి ప్రారంభించి భాషా పరిచయము కలిగించుకొనుడు.

గ్రంథము వెల 2 రూపాయలు. పోస్టేజి 9 అణాలు.

ఆనందబోధిని ఆఫీసు,
నెం. 6 లాయరు చిన్నతంబిమొదలి వీధి,
సౌకారుపేట, మదరాసు.